నమస్తే తెలంగాణ
సిద్దిపేట
15 హైదరాబాద్, మంగళవారం 12 మార్చి 2024 SIDDIPET

# నీళ్లిచ్చి పంటలను కాపాడాలి

## సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

నంగునూరు, మార్చి 11 : సాగునీరు విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద సోమవారం హన్మకొండ-సిద్దిపేట రహదారిపై రైతులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, రెండు రోజుల్లో సాగునీరు అందకుంటే పంటలు పూర్తిగా ఎండిపోయి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి పెద్దవాగులోకి నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకుని రైతులకు సముదాయించారు. రైతుల ఆందోళన విషయాన్ని ఎస్సై భాస్కర్‌రెడ్డి ఇరిగేషన్ డీఈఈ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు సాగు నీరు అందిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. అరగంట పాటు రాస్తారోకోతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ధర్నాలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్ రైతులకు మద్దతు తెలిపారు.



నర్సంపల్లి పెద్ద తండాలో బోరు వట్టిపోవడంతో ఎండిపోయిన పొలంలో మేకలను మేపుతున్న రైతులు



హన్మకొండ-సిద్దిపేట రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలి

కొమురవెల్లి, మార్చి 11 : దేవాదుల పైపులైన్ ద్వారా మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి కాలువల ద్వారా మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు నీళ్లు వదలాలని సోమవారం సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భజాలాలు తగ్గిపోయి బోర్లు నీళ్లు పోసే పరిస్థితి లేక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వదిలి రైతాంగాన్ని ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు, సార్ల యాదయ్య, తడకపల్లి శ్రీనివాస్, సున్నం యాదయ్య, ఆరుట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు పత్రాల యాదగౌడ్**

చేగుంట, మార్చి 11: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు పత్రాల యాదగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్యయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మాచునూరి శ్రీశైలం యాదవ్, జిల్లా కార్యదర్శి మామిడి నర్సారెడ్డి కోరారు. చేగుంట మండలం అనంతసాగర్, రుక్మాపూర్, నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లి పెద్దతండా, జామ్లా తండా, నార్సింగిలో ఎండి పోయిన వరి, మొక్కజొన్న పంటలను, ఎండిపోయిన బోరుబావులను సోమవారం స్థానిక రైతులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎండి పోయిన పంటలను చూపుతూ తమ గోడును వెల్లబోసుకున్నారు. రైతు రక్షణ సమితి నాయకులు మాట్లాడుతూ రైతులు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి వ్యవసాయం సాగుచేస్తే, బోరుబావుల్లో నీరు అడుగంటి పోవడంతో వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. మేకలకు, పశువులకు మేతగా మారినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వారివెంట చౌడం నరేందర్, ఎ.అశోక్‌రెడ్డి, వజ్జరాజు, మాజీ సర్పంచ్ చత్రీయనాయక్, బిక్యానాయక్, భాషనాయక్, రైతులు ఉన్నారు.



నార్సింగి మండలం నర్సంపల్లిపెద్ద తండాలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న తెలంగాణ రైతు రక్షణ సమితి సభ్యులు

# కాంగ్రెస్ కరువు ఛాయలు..!

- కర్షకుడికి సాగునీటి కష్టం
- నీళ్లు లేక రైతన్నల పాట్లు
- కరెంటు కోతలతో ఇక్కట్లు..
- పశుగ్రాసమవుతున్న పంటలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో నీటికోసం ధర్నాలు

కాంగ్రెస్ పాలనలో కరువు ఛాయలు అలుముకున్నాయి. 'మార్పు కావాలి' అంటూ అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత కర్షకులకు కష్టకాలాన్ని చవిచూపిస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. అసలే సాగుకు నీరు లేకపోవడంతో పాట్లు పడుతున్న అన్నదాతలకు కరెంటు కోతలు తలనొప్పిగా మారాయి. పంట పొలాల్లో సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయి పశువులకు గ్రాసంగా మిగులుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సాగునీళ్లిచ్చి పంటలను కాపాడాలని రైతన్నలు రోడ్లపై ధర్నాలు చేస్తున్నారు.



**ఎవుసం సాలిచ్చుకున్నం...**

అప్పులు చేసి ఆరు వందల ఫీట్లతో దాకా రెండు బోర్లు వేయించా. అందులో చుక్క నీరు రాకపోవడంతో గుంతలను పూడ్చివేశాం.ఎవుసం చేయడం సాలిచ్చుకున్న. ప్రభుత్వం ఆదుకోవాలి.ఎండిపోయిన పంటల వివరాలను సేకరించి పంటలకు నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

– మడావత్ లక్కు, రైతు, నర్సంపల్లి పెద్ద తండా, నార్సింగి మండలం

## పశువులకు మేతగా మారిన పొలాలు

చేగుంట, మార్చి 11: కరెంటు కోతలు, భూగర్భ జలాలు అడుగంటడంతో చేతికి వచ్చిన పంటలు ఎండిపోయి మేకలు, పశువులకు మేతగా మారాయి. మెదక్ జిల్లా నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్దతండా, జామ్లా తండాలో 1800 ఎకరాలతో పాటు చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లి తదితర గ్రామాల్లో రైతులు వేసిన పంటలు ఎండిపోవడంతో పశువులకు మేతగా మారాయి. ఎండిన పంట పొలాలను ఎంపీపీ చిందం సబిత, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారాం బాబు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వేచేయించి పంటలు దెబ్బతిన్న రైతులను గుర్తించి పరిహారం అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన రైతు తిప్పరాజ్ పొలాన్ని అదే గ్రామానికి చెందిన బోళ్ల సత్తయ్య కౌలుకు తీసుకుని వరి పంట వేశాడు. పొలంలోని ఆరు బోర్లలో నీరు ఎత్తిపోగా, సోమవారం కొత్తగా బోరు వేయగా చుక్కనీరు రాలేదు.దీంతో రైతు బోరుమన్నాడు.



**రెండు లక్షలు ఖర్చు అయినవి....**

10 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న. పెట్టుబడికి ఇప్పటి వరకు రెండు లక్షలకు పైగా డబ్బులు ఖర్చు అయినవి.ఆరు బోర్లు ఉన్నా గుంట పొలం పారడంలేదు. పొలం ఎండిపోతుంటే ఏమి చేయాలే అర్థం కాక పంటను కాపాడుకునేందుకు మళ్లీ బోరు వేస్తే దుమ్ము మాత్రమే వచ్చింది.

– బోళ్ల సత్తయ్య, కౌలు రైతు, నార్సింగి



నర్సంపల్లి జామ్లా తండాలో ఎండిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న నార్సింగ్ ఎంపీపీ చిందం సబిత, జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి తదితరులు

# కొండాపూర్‌లో ఎండుతున్న పొలాలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పశువులపాలవుతున్న పచ్చని పంటలు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 11: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్‌కు చెందిన బాకి మొగిలి అనే రైతు తనకున్న ఓ బోరు బావి సహాయంతో ఎకరం పొలంలో వరిని సాగు చేశాడు. ఎకరం పొలం దాదాపుగా ఎండిపోయింది. వడ్లూరి కనకాచారి అనే రైతు రెండెకరాల పొలంలో వరి వేశాడు. బావి నీళ్ల సహాయంతో పొలాన్ని పారిస్తున్నారు. దీంతో పదిగుంటల పొలం ఎండిపోయింది. ఇటీవల కాలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు, బావుల నీటిమట్టం తగ్గిపోయింది. దీనికితోడు తరుచుగా కరెంట్ ట్రిప్ అవుతుండడంతో నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయి. నెర్రెలిచ్చిన పొలాలను తడిపేందుకు రైతులు నానా తంటాలు పడిన ఫలితం లేకపోతున్నది. దీంతో చేసేదేమి లేక రైతులు వరి చేనులో పశువులు, జీవాలను మేపుతున్నారు. పచ్చని పంటలు ఎండిపోయి పశువుల పాలవుతుండడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పంటలు ఎండిపోతే కుటుంబాలను ఎలా పోషించుకునేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చెరువు, కుంటల నిండా నీళ్లు ఉండడంతో బోరుబావుల్లో నీళ్లుండేవని, ప్రస్తుతం చెరువు, కుంటలు ఎండిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేండ్లుగా కరువు అనేది లేదని, మళ్లీ పాత రోజులు దాపరిస్తున్నాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే చెరువు, కుంటలను నింపాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



వరి చేనును మేస్తున్న జీవాలు

# పంట దక్కించుకునేందుకు పడరాని పాట్లు

- ట్యాంకర్‌తో నీళ్లు పోస్తూ పొలాన్ని బతికించుకుంటున్న రైతు
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఇలాకాలో ఇదీ పరిస్థితి


అక్కన్నపేట, మార్చి 11: అడుగంటిన భూగర్భజలాలు. రాత్రీపగలు తేడా లేకుండా వచ్చిపోయే దొంగ కరెంటు... కాలిపోతున్న మోటర్లు... ఎండుతున్న పంట చేన్లు... సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల వ్యాప్తంగా కరువు పరిస్థితులు దాపురించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాసంగి సాగుకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి, ఆరుగాలం కష్టపడి పండించిన వరి పొలాలు కండ్ల ముందే నీళ్లందక ఎండిపోతుండటంతో రైతులు అరిగోస పడుతున్నారు. ఎండిన పంట పొలాలను చూసి రైతులు కన్నీళ్లు కారుస్తున్నారు. కొన్నిచోట్ల పొట్ట దశలో ఉన్న వరి చేన్లు కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతుండగా, మరికొన్ని చోట్ల పశువులకు మేతగా వదిలేస్తున్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన యువ రైతు గొట్టె మహేందర్ నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఇప్పటికే రెండు ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. మరో రెండు ఎకరాలు కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు ట్యాంకర్‌తో నీళ్లు పోస్తూ వరి చేనును బతికించుకుంటున్నాడు. బోదర్‌వాగు తండాకు చెందిన జగన్‌నాయక్ ఎకరం వరి చేను చివరి దశలో ఉంటడంతో సుమారు లక్ష రూపాయలు అప్పు తెచ్చి బోరు వేస్తే చుక్కనీరు రాలేదు. మండల కేంద్రానికి చెందిన అమరగొండ ప్రమీల ఎకరం పొలం ఎండిపోతుండటంతో చూసి తట్టుకోలేక పక్కనే ఉన్న మరో రైతు అర్జున్‌నాయక్ నుంచి సగం పాలుకు(పండిన పంట చెరి సగం)తో ఒప్పందం చేసుకొని వరుస తాళ్ల పారకంతో వరి చేనును నెటుకొస్తున్నది. గొల్లపల్లికి చెందిన బండి తిరుపతి అనే రైతు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. చుట్టూ పంట చేన్లు ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను బయటకు తీసుకువచ్చే పరిస్థితి లేకుండాపోయి వరిచేను ఎండిపోతున్నది. చౌడుతండాకు చెందిన భూక్యా సమ్మయ్య అనే రైతు రెండు ఎకరాల మక్కపంట చివరి దశలో ఉండటంతో కనీసం రెండు, మూడు తడులు నీళ్లు అందించేందుకు ఓ రైతుకు రూ. 7వేలు ఇచ్చి పైపులు వేసి పారించాడు. ఇలా మండలంలో ఏ రైతును కదిలించినా క'న్నీళ్ల' ముచ్చటే చెప్పుతున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రవాణాశాఖ, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇలాకాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పంటలు దెబ్బతిన్న రైతులకు ఆర్థిక సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

**ట్యాంకర్‌తో రోజుకు పది ట్రిప్పులు..**



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసిన. సుమారు రూ. 60 వేల వరకు పెట్టుబడి అయ్యింది. బోర్లలో ఒక్కసారిగా నీళ్లు అడుగుకుపోయినై. పొలమంతా పొట్ట, ఈత దశలో ఉంది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. దీంతో ఓ రైతు వద్ద రూ. 10 వేలకు బోర్ నీళ్లు మాట్లాడుకొని ట్యాంకర్‌ను అద్దె తీసుకొని వరి చేనుకు పోస్తున్న. ఇలా సుమారు రెండు ఎకరాలకు వరకు పారుతుంది. మిగిలిన రెండు ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. ఏడేనిమిదేళ్లుగా నీళ్ల కరువు లేకుండా ఉండేది. ఏప్రిల్, మేలో కొంచెం ఇబ్బంది అయ్యేది. అసొంటిది ఇప్పుడే (ఫిబ్రవరి చివరి వారం నుంచి) నీళ్లు అడుగంటినై. రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పంటలన్నీ ఎండిపోతున్నాయి. రైతు బాధలు రైతులకు మాత్రమే అర్థం అవుతాయి. సీఎం రేవంత్‌రెడ్డి నష్టపోయిన రైతుల గురించి ఏం ఆలోచన చేస్తారో చూడలే మరి.

– గొట్టె మహేందర్, యువ రైతు, అక్కన్నపేట (సిద్దిపేట జిల్లా)



సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో బోరు నుంచి ట్యాంకర్‌లోకి నీళ్లు నింపుతున్న రైతు మహేందర్



సిద్దిపేట లో ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

# కాంగ్రెస్ హామీలపై ప్రతి పల్లెలో చర్చపెట్టాలి

- హామీలు విస్మరించిన కాంగ్రెస్..
- తెలంగాణకు నిధులివ్వని బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు వచ్చింది..
- ఎంపీ ఎన్నికల్లో సిద్దిపేట భారీ మెజార్టీనివ్వాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 11( నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ఎక్కడికక్కడ చర్చపెట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలపై సోమవారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చి గెద్దెనెక్కిన తర్వాత విస్మరించిందన్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, వరికి బోనస్ హామీలు అమలు కావడం లేదన్నారు. ఆరోగ్యలక్ష్మి కింద రూ.10 లక్షల పెంపు రాష్ట్రంలో ఏ ఒక్కరికైనా ఇచ్చారా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలన్నారు. మహిళల రూ.2,500 ఇస్తా అన్న మాట ఏమైందని ప్రశ్నించారు. డిసెంబర్ నుంచి రూ.4 వేల పింఛన్ ఇస్తామని 4 నెలలు అయినా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కరువు వచ్చిందని, ఎక్కడ చూసినా పంటలు ఎండిపోతున్నాయని, రైతుల పంటలను కాపాడడానికి ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. సాగునీటి కోసం రైతులు బోర్లు, బావులను తవ్వుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడు బోరు బండ్లు కనపడలేదన్నారు. కరెంట్ కష్టాలు సైతం మొదలైనట్లు తెలిపారు. రైతుల మీద ఈ ప్రభుత్వానికి ఏమాత్రం ప్రేమ లేదన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకున్నట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు.

**కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలి**

కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై అంతటా చర్చ మొదలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేస్తే వృథా అన్నారు. వారు గెలిచినా ఢిల్లీలో కాంగ్రెస్ వచ్చేది లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చివాత పెట్టాలని రైతులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా కాంగ్రెస్ పార్టీకి రాదన్నారు. బీజేపీ తెలంగాణకు ఏం చేయలేదని, ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. తెలంగాణకు ఒక్క నవోదయ స్కూల్ ఇవ్వలేదన్నారు. దేశంలో 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేస్తే మనకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదన్నారు. ప్రజల గొంతుకగా మనం మాట్లాడుదాం.. ప్రజలు కేసీఆర్‌ను బీఆర్ఎస్‌ను కడుపులో పెట్టుకొని చూసుకుంటారన్నారు. రైతుల సంక్షేమం విషయంలో కేసీఆర్‌కు ఉన్న ప్రేమ కాంగ్రెస్‌కు ఎప్పటికీ ఉండదన్నారు.

**సిద్దిపేట మంచి మెజార్టీ ఇవ్వాలి**

పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట ప్రాంతం మంచి మెజార్టీ ఇచ్చి అగ్రస్థానంలో నిలవాలని పార్టీ కార్యకర్తలకు మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సీరియస్‌గా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సిద్దిపేట అంటే ప్రత్యేకత ఉందని, అభివృద్ధి కాదు మెజార్టీలోనూ సిద్దిపేట ముందు ఉండాలన్నారు. పులివెందుల ... కుప్పం... సిద్దిపేట అనే ప్రత్యేకత సాధించుకున్నట్లు తెలిపారు. మన అభివృద్ధిపై అక్కసు వెల్లబుచ్చింది ఇదే కాంగ్రెస్, బీజేపీ నాయకులే కాదా... అలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేద్దామని హరీశ్‌రావు క్యాడర్‌కు పిలుపునిచ్చారు.

# భారీగా రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు, మార్చి 11 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని రింజిమ్ దాబా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు.టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో 35,470 కిలోల పీడీఎస్ రైస్‌తో ఉన్న లారీ పట్టుబడింది. గుజరాత్‌కు చెందిన వి.సాగర్ బాయ్, పరమార్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి లారీని సీజ్ చేశారు.



రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు

# 'మల్లన్న' ఆదాయం రూ.55,18,026

చేర్యాల, మార్చి 11: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల 8వ ఆదివారం రూ.55,18,026 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్ర(మహాశివరాత్రి), శని, ఆదివారాల్లో ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం తదితర వాటిద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. మహాశివరాత్రి రోజున రూ.16,54,043, శనివారం రూ.16,11,232, ఆదివారం రూ.22,52,751 వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది ఉన్నారు.

# అల్లా దయతో అంతా మంచి జరగాలి

**ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు**

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సిద్దిపేట, మార్చి 11: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం ప్రారంభంకానున్న నేపథ్యంలో ముస్లింలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో మత సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ విశిష్టత అన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీక్ష చేస్తున్న ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.